12

# మంచి సైనికుని యొక్క బహుమానం

*"నేనిప్పుడే పానార్పణముగ పోయబడుచున్నాను, నేను వెడలిపోవు కాలము సమీపమై యున్నది. మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడ ముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని. ఇకమీదట నా కొరకు నీతికిరీటముంచబడియున్నది. ఆ దినమందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును, నాకు మాత్రమే కాకుండ తన ప్రత్యక్షతను అపేక్షించు వారికందరికిని అనుగ్రహించును" (2 తిమోతి 4:6-8).*

నీవు ఒక అపాయకరమైన ప్రమాదంలో చిక్కుకుని, నీ జీవితం యొక్క చివరి గడియలను నీవు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో, నీవు ఏమి ఆలోచిస్తూ ఉంటావు? నీ గత జీవితాన్ని వెనుకకు చూచి, శాంతితోను సంతృప్తితోను ఉన్నట్టు నీవు దానిని కనుగొనగలవా? మంచి సమయాల్లోను చెడ్డ సమయాల్లోను ఆయన నీకు తోడుగా ఉండి నడిపించి సహాయపడినందుకు ప్రభువు ద్వారా దేవుని నీవు స్తుతించగలవా? ఆయనతో నీకు కలిగియున్న సన్నిహిత బాంధవ్యానికి నీవు ఆయనకు కృతజ్ఞుడవై ఉన్నావా? నీ జీవితకాలమంతటిలో ఆయనయందు నమ్మికయుంచినందుకును మరియు మరణమందును, ఆయనయందు నమ్మిక యుంచినందుకును హృదయాన శాంతి నిండిపోయిందా?

మరోవైపు తీవ్రమైన దుఃఖం లేక పశ్చాత్తాపం నీకు కలిగిందా? ప్రభువైన యేసుతో నీ బాంధవ్యాన్ని గంభీరంగా నీవు తీసికోలేదా? నీవు కడసారి ఊపిరి పీల్చుతుండగా, "అలాగైయున్నట్టయితే," అనే మాటలతో నీ హృదయము తల్లడిల్లిపోతుందా? "నేను ప్రభువు మాటలు సీరియస్‌గా తీసికొనియున్నట్టయితే! నేను క్రీస్తు యొక్క సువార్తకు లోబడియున్నట్టయితే! నేను నమ్మకంగా ఉండియున్నట్టయితే! క్రీస్తును ఆయన సంఘాన్ని నా జీవితంలో ప్రథమ స్థానంలో ఉంచుకొని యుండినట్లయితే! ఇతరులతో ఈ నిరీక్షణా సందేశాన్ని నేను పంచుకొనియుండినట్లయితే!"

ఈ పాఠంలో మనం నీవంటి నావంటి ఒక మనిషి ప్రక్కనే ఉన్నాం. శరీర సంబంధమైన ఆశలు, కోర్కెలు గల ఒక మనిషి; పాపంతోను అసంపూర్ణతతోను దైనిక పోరాటం గల ఒక మనిషి; తన జీవితంయొక్క చివరి గడియలను ఎదుర్కొంటున్న ఒక మనిషి ప్రక్కనే నిలుద్దాం. తన ఆత్మ నిత్యత్వంలోనికి పయనించుతుందని గ్రహించిన పౌలు యొక్క హృదయంలోనికి, మనస్సులోనికి దూరి, అతనియొక్క ఆలోచనలను ఉద్వేగాలను అనుభవించడానికి ప్రయత్నించుదాం. దేవుని సేవించుతూ, ఆయన

వాక్యాన్ని ప్రకటించాడన్న నేరానికి చంపబడనైయున్న పౌలు యొక్క తుది పలుకులు 2 తిమోతి 4:6–8లో దాఖలు చేయబడ్డాయి.

తన రోమా చెరసాలలోనుండి, పౌలు యిలా వ్రాశాడు:

> నేనిప్పుడే పానార్పణముగ పోయబడుచున్నాను, నేను వెడలిపోవు కాలము సమీపమై యున్నది. మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని. ఇక మీదట నా కొరకు నీతికిరీటముంచబడియున్నది ... (2 తిమోతి 4:6–8).

పౌలు తన మరణాన్ని ఎదుర్కోబోతుండగా బహు శాంతిని, అభయాన్ని కలిగినవాడై యున్నట్టు మనం భావించవచ్చు. తన జీవితపు చివరి గడియలలో, పౌలు మూడు దిక్కులను కలయజూచాడు అతడు చనిపోనైయున్నట్టు ఎరిగి సమాధివైపుకు క్రింది వైపుకు చూచాడు. తాను ఈ భూమిమీద జీవించిన జీవితం వైపుకు వెనుకకు తిరిగి చూచాడు; తన హృదయ పూర్తిగా ప్రేమించిన ఆ దేవుని యెదుట తీర్పు దినాన అతడు నిలువవలసి వస్తుందని ఎరిగి ముందునకును అతడు పారజూచాడు. జీవితానికి ఉండే ఈ మూడు తీక్షణమైన చివరి అవలోకనాలను మనం యిక్కడ గమనిద్దాం.

## క్రిందివైపుకు చూపు: ఆందోళనలేని మరణం

మొదటిగా, పౌలు సమాధిలోనికి క్రిందివైపుకు చూచాడు, భయముగాని ఆందోళన గాని లేకుండ అతడు అలా చేయగలిగాడు. "నేనిప్పుడే పానార్పణముగా పోయబడు చున్నాను" (6ఎ వ.) అని అతడు వ్రాశాడు. దహన బలి అర్పణకు ముందు ద్రాక్షారసము పానీయార్పణముగా పోయబడాలని సంఖ్యా 15లో ధర్మశాస్త్రం ఆజ్ఞాపించిన దానిని అలంకారంగా ఉపయోగించి, పౌలు తన మరణాన్ని వర్ణిస్తున్నాడు. అంటే యింతకు, "భూమి మీద నా జీవితం ముగియవస్తుంది, సజీవయాగంగా నా శరీరాన్ని, ఆత్మను నేను ప్రభువునకు ఎలా సమర్పించుకున్నానో, ఆయన పరిశుద్ధ నామమునకు స్తుతి కలుగునట్లు కడపటి బలిగా నా ప్రాణాధారమైన రక్తాన్ని సహా ఆయన సముఖంలో కుమ్మరించి వేస్తాను" అన్నట్టు పలికాడు.

"నేను వెడలిపోవు కాలము సమీపమైయున్నది" (6బి వ.) అని పౌలు చేర్చాడు. తీరాన్ని విడిచిపోయే ఓడలాటి చిత్రాన్ని పౌలు తన మరణాన్ని వర్ణించడానికి ఉపయోగించాడు. ఓడలో సమస్తం సిద్ధంచేయబడ్డాయి, తీరానికి తగిలింపబడియున్న తాళ్లు మాత్రమే ఊడదీయబడాలి; అప్పుడు ఆ ఓడ సముద్రంలోని లోతైన నీళ్లలోనికి తన ప్రయాణాన్ని సాగిస్తుంది. పౌలు ఆత్మ తాత్కాలికమైన సమయ ప్రపంచంనుండి అంతము లేని నిత్య కాల సముద్రంలోకి వెళ్లేలా, భౌతికమైన దేహంతో పౌలు ఆత్మను చుట్టుకున్న తీగెలు విప్పివేయడానికి సిద్ధంగా ఉన్నాయి.

తాను మరణాన్ని ఎదుర్కొనేటప్పుడు ఎంతటి అద్భుతమైన విశ్వాస తత్వాన్ని పౌలు కలిగియున్నాడు! పౌలు మరణాన్ని ధైర్యంగా ఎదుర్కొన గలిగిన సామర్థ్యం ఆకస్మికంగా కలిగినది కాదు! దేవుని వైపు చూచి హృదయ పూర్వకంగా ఆయనయందు నమ్మికయుంచి

తాను ఎదుర్కొన్న ప్రతి పరిస్థితిలోను ఆయన మీద ఆనుకొనడానికి అతడు నేర్చుకున్నాడు. కడపటి శత్రువైన మరణాన్ని ఎదుర్కొంటుండగా, నెమ్మదికరమైన విశ్వాసంతోను ధైర్యంతోను అతడు నిలిచియున్నాడు. గత సంవత్సరాలలో అతని కాపాడి, తన ప్రతి అవసరతను దేవుడు తీర్చాడు; పానీయార్పణముగా అతడు పోయబడినప్పుడును, నిత్యత్వంలోనికి పయనించేలా తన ఆత్మ దేహాన్ని వదలిపోయెటప్పుడును ఆయన పౌలుతో కూడా ఉంటాడు.

సంవత్సరాలకు ముందు, ప్రభువు యొక్క చేతికి పౌలు తన జీవితాన్ని అప్పగించు కున్నాడు. తన గర్వాన్ని, అహంకారాన్ని, స్వయం సమృద్ధిని తనలోనుండి ఖాళీ చేసికొన్నాడు. తనమీద కేంద్రీకరించుకొన్న తన హృదయాన్ని క్రీస్తు ప్రభువు మీద కేంద్రీకరించాడు. సువార్తను విశ్వసించి లోబడడం అనే అల్పమైన కార్యమందు, తన పాపపు ప్రాచీన పురుషుని నీటి సమాధియనే బాప్తిస్మమందు పాతిపెట్టబడడానికి పౌలు సమ్మతించాడు (అపొ. 22:16). నీటి మూలముగాను ఆత్మ మూలముగాను జన్మించిన వాడై, ఆ నీటి సమాధిలోనుండి దేవుని నూతన సృష్టిగా అతడు లేపబడ్డాడు. బాప్తిస్మమందు తన పాపములను కడిగివేయడానికి పౌలు తన క్రైస్తవ జీవితమంతయు తాను నమ్మిన దేవునే అనుసరించాడు. తాను ఏ విశ్వాసంతోను, నమ్మికతోను జీవించాడో దాని కొరకే యిప్పుడు చనిపోడానికి సిద్ధంగా ఉన్నాడు.

## వెనుకవైపుకు చూపు: జయ జీవితం

పౌలు సమాధివైపు క్రిందికి చూడడం మాత్రమేగాక, అతడు 7వ వచనాన్ని వ్రాసేటప్పుడు, తన జీవితానికి వెనుకతట్టుకు తిరిగి ఒక చూపు వేశాడు, “మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడ ముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని.” దేవుని పిల్లలలో ప్రతివాడును పౌలుతో కలసి ఈ ప్రతిపాదనలను చేయవలసిన వాడై యుంటాడు.

“మంచి పోరాటము పోరాడితిని” అని పౌలు అన్నాడు. “విశ్వాసపు పోరాటం ఎలా మంచి పోరాట మౌతుంది?” అని ఎవరైనా అడుగవచ్చు. ఇది మంచి ప్రశ్నయే ఎందుకంటే పోరాటాలన్నీ మంచిపోరాటాలు కావని మనకు తెలుసు. అనేక సార్లు పోరాటాలు నాశనకరమైనవై యుంటాయి. ఏదియెలాగున్నా, క్రైస్తవ పోరాటం మంచిపోరాటమే, అది విశ్వాసపు పోరాటమైయుంది. మనం గుర్తించినా గుర్తించకపోయినా, మనలో ప్రతిఒక్కడు సైనికుడే. ప్రభువునందలి విశ్వాసం చేత మనం పోరాడవచ్చు, లేక ఆయనకు విరోధంగా మనం పోరాడవచ్చు. మత్తయి 12:30లో ప్రభువు యిలా అన్నాడు, “నా పక్షమున ఉండనివాడు నాకు విరోధి; నాతో కలిసి సమకూర్చనివాడు చెదరగొట్టువాడు.” ప్రభువు యొక్క సైన్యంలోచేరి ఆత్మలను సంపాదించ పోరాడవచ్చు, లేదా సాతాను సైన్యములో చేరి మన చుట్టునున్న ఆత్మలను రక్షణకు అడ్డుగా నిలిచియుండవచ్చు. ఆత్మల యుద్ధంలో తటస్థ వైఖరి లేక మార్గం లేదు, పోరాడదగిన మంచి పోరాటం ఏదైనా ఉంటే, అది క్రీస్తు ప్రభువు కొరకు పోరాడే పోరాటమే!

“నా పరుగు తుద ముట్టించితిని” అని పౌలు దానితో చేర్చాడు. ముగింపు గీత దగ్గరకు అతడు మరణమందు సమీపిస్తూ, పరుగు పందెమును పౌలు తన మనస్సులో ఉంచుకున్నాడు. క్రైస్తవ జీవితం విశ్వాసపు పరుగు పందెమే, మరియు ఒకడు తన్ను అడుగుకొనవలసిన నిదానమైన ప్రశ్న ఏమంటే “నేను పందెమందు పరిగిడుతున్నానా?” భూమి మీద నున్న ప్రతివ్యక్తి పట్ల సృష్టికర్తయైన దేవుడు ఒక ఏర్పాటు కలిగియున్నాడని దేవుని వాక్యము స్పష్టంగా బోధిస్తుంది. ఓర్పుతో లేక సహనంతో విశ్వాస పోరాటము లేక పరుగు పరుగిడవలసినట్టు ఆయన ఏర్పాటులో చేర్చబడింది. మనం చివరి గీతను దాటి ఒకనాడు ప్రభువుతోకూడ మహిమలో ప్రవేశించేలా అది ఏర్పాటు చేయబడింది.

నీ హృదయాన్ని నీ జీవితాన్ని యింకను దేవుని చిత్తానికి నీవు సమర్పించు కొనకున్నట్టయితే, నీవు వెంటనే మారుమనస్సుపొంది, నీ హృదయాన్ని చక్కపరచుకోవాలి. దేవుని చిత్తం యొక్క కేంద్రస్థానంలో మనమున్నాం. ఆయన రాజ్యమును ఆయన నీతిని మొదట వెదకుతూ, విశ్వాస సంబంధమైన పందెపురంగంలో నిలిచి, మన జీవితపు పరుగును తుదముట్టించగలం. శుభవార్త ఏమంటే, నీవు ఈ పందెపు రంగంలో పరుగెత్త కోరుకుంటే, ప్రభువు తానే మనతోకూడా ఉండి అంతమువరకు మనలను ప్రోత్సహించుతూ బలపరచడానికి వాగ్దానం చేశాడు.

తన జీవితపు వెనుకతట్టు తిరిగి చూచిన పౌలు, “విశ్వాసమును కాపాడుకొంటిని” (7వ వ.) అని దానితో కలుపుతున్నాడు. విశ్వాసమని ఈ లేఖన భాగంలో పౌలు మాట్లాడుతుంది క్రొత్త నిబంధనలో దాఖలు చేయబడిన ఉపదేశాలు, సిద్ధాంతాలకు సంబంధించింది. పౌలు కాపాడుకున్న “విశ్వాసము”నకు గుండెవంటిది ప్రభువైన యేసు యొక్క మరణము సమాధి పునరుత్థానాలతో కూడిన సువార్త సందేశమైయుంది (1 కొరింథీ. 15:1–4ను పోల్చి చూడు). “విశ్వాసము” అని పౌలు సూచించేది దేవుని రాజ్యము మరియు సాతాను రాజ్యము; సంఘము మరియు లోకము; శరీరము మరియు ఆత్మ; రక్షణ మరియు శిక్ష; పరలోకము మరియు నరకము అనేవి ప్రశస్తమైన దైవ ప్రేరేపితమైన క్రొత్త నిబంధనయొక్క సిద్ధాంతమైయుంది. తాను క్రైస్తవుడైనది మొదలు తన జీవితపు వెనుక భాగమునకు చూడగా, తన మంచి మనస్సాక్షియంతటితోకూడ, “విశ్వాసమును కాపాడుకొంటిని” అని అంటున్నాడు.

“విశ్వాసము కాపాడుకొంటిని” అనే ప్రతిపాదన, పౌలు పరిపూర్ణుడుగా జీవించాడని సూచించదు; కాని దేవుని యొక్కయు మన ప్రభువైన యేసు క్రీస్తుయొక్కయు పరిపూర్ణమైన విశ్వాసానికి విధేయతకును సంబంధించినదై, అతడు సమర్పణతోకూడిన జీవితాన్ని జీవించాడనియే దాని భావము! పౌలు తన జీవితానికి వెనుకతట్టు చూడగా, కష్టము బాధ అతడు గుర్తు చేసికోగలడు. అది యింకా ఏమి సంభవించినా సరే, ప్రభువైన యేసు క్రీస్తు మీదనే పౌలు తన దృష్టిని కేంద్రీకృతం చేశాడు. ప్రతి దినం అతడు యిలా జ్ఞాపకం చేసికొంటూనే ఉన్నాడు, “నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడి యున్నాను; ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్ను తాను అప్పగించుకొనిన దేవుని కుమారునియందలి విశ్వాసమువలన జీవించుచున్నాను”

(గలతీ. 2:20). అతడు తన శరీరమును, ప్రాణమును, ఆత్మను ఈ విశ్వాసములోనికి పెట్టాడు. ఇప్పుడు ముగింపు గీత కనుమేరలో ఉంది. సిలువయొక్క సైనికుడుగా, “మంచిపోరాటము పోరాడితిని” (7ఎ వ.); విశ్వాస సంబంధమైన పందెపు రంగంలో పరుగెత్తేవానిగా, “నా పరుగు తుదముట్టించితిని” (7బి వ.); మరియు నమ్మకమైన గృహనిర్వాహకుడుగా, “విశ్వాసమును కాపాడుకొంటిని” అని అతడు చెప్పగలిగియున్నాడు (7సి వ.).

పౌలు నిజంగా ఈ క్లెయిమ్స్ చేయగలవాడైనందున, తీర్పు దినం కొరకు అతడు ఎదురు చూస్తున్నట్టు అతడు చెప్పుకో గలిగాడు. “ఇక మీదట నాకొరకు నీతి కిరీటముంచబడియున్నది. ఆ దినమందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును, నాకు మాత్రమే కాకుండా తన ప్రత్యక్షతను అపేక్షించువారికందరికిని అనుగ్రహించును” అని అతడు తెలియజేశాడు (8 వ.).

ప్రభువైన యేసు క్రీస్తునందలి విశ్వాసంవలన పౌలు జీవించాడు. దానికి ప్రతిఫలంగా, మరణముయొక్క శీతల హస్తం అతని గొంతును గట్టిగా పట్ట నారంభించింది, పౌలుకు భీతిలేదు సరిగదా! చింతకూడా లేదు. తన యెదుట నిలిచిన సమాధిని క్రిందికి ధైర్యంగా చూడగలడు. తాను ప్రభువైన యేసుకొరకు జీవించిన గత జీవితం వైపు చూడగలడు. అంతేగాక, తనను తీర్పుతీర్చబోయే వాడు వ్యక్తిగతంగా తన్ను ఎరిగినవాడును, చెడు కాలాల్లోను మంచి కాలాల్లోను తనతో ఈ భూనివాస కాలంలో నిలిచినవాడును అయ్యున్న ప్రభువేనని యెరిగి, తీర్పు దినం కొరకు ముందుకును నిరభ్యంతరంగా చూడగలడు! ఈ విధంగా, మరణఛాయగల లోయలోనే, అతడు “నీతికిరీటము” కొరకు ఎదురు చూస్తూ ఉండగా అతనికి భవిష్యత్తు ప్రకాశమానంగా కన్పిస్తుంది.

## ముందు చూపు: భవిషత్తు మహిమలో

ఒలింపిక్ క్రీడలలో గ్రీకు క్రీడాకారుడు పందెమందు గెలిచినప్పుడు, విజయహారము అతడు పొందుతాడు. అయితే ఆ బహుమానము కొద్ది దినములలోనే అది వడలి వాడి పోతుంది. తాత్కాలికమైన అలాటి బహుమానానికి భిన్నంగా, “వాడబారని మహిమా కిరీటము”ను పొందుదురని పేతురు వ్రాశాడు (1 పేతురు 5:4). 2 పేతురు 1:11లో అతడిలా అన్నాడు, “... ఆలాగున మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు యొక్క నిత్యరాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అనుగ్రహింపబడును.”

అనుదినము పఠించి, క్రైస్తవుడు యిట్టి నిరీక్షణతోకూడిన మాటలను జ్ఞాపకం చేసికోవాలి. అనేకమంది క్రైస్తవులు ఈ పాప లోకంలో స్థిరపడిపోయి, పరలోకమందు వారికొరకు నిలువ చేయబడిన నిధుల విషయం మరచిపోయి బ్రదుకుతూ ఉంటారు! పరలోకంలో దేవుడు, నరకానికి సంబంధించిన అపవాది ఉన్న సంగతిని మనమందరం గుర్తు చేయబడవలసినవారంగా ఉంటాం. మన దేవుని యొక్క ఆత్మసంబంధమైన శాశ్వతమైన రూపంలో మనము సృజింపబడినవారమై ఉన్నాం! మరియు ఒక దినాన భూమి మీద మనం ఎలా జీవించామో దాని విషయమై లెక్క చెప్పవలసిన అవసరత

గలవారమై యున్నాం. "విశ్వాస సంబంధమైన మంచిపోరాటం నేను పోరాడానా?"; "విశ్వాససంబంధమైన నా పరుగును తుదముట్టించానా?"; "నా విశ్వాసాన్ని కాపాడు కున్నానా?" అనే ప్రశ్నలు మాత్రమే ఆ దినాన ప్రాముఖ్యమై యుంటాయి.

ఆ ప్రశ్నలలో ప్రతి ఒక్కటి విశ్వాసానికి సంబంధించినవై యున్న సంగతిని గమనించు! "నీతిమంతుడు విశ్వాస మూలమున జీవించును" అని పౌలు తెలిపాడు (రోమా 1:17). ఆ అంశంతో జతచేసి, నీతిమంతుడు విశ్వాసంవలననే చావదలచుకొంటే విశ్వాసం వలన పోరాడాలి, విశ్వాసంవలన పరుగెత్తాలి! ఆరంభమునుండి ముగియువరకు, యేసు క్రీస్తునందలి మన విశ్వాసమే దేవుని దృష్టిలో ప్రధానమైనది!

## ముగింపు

ప్రభువైన యేసుతో విశ్వాస సంబంధమైన వ్యక్తిగత బాంధవ్యం నీకు ఉందా? నీ హృదయము, ఆత్మయొక్క కనుదృష్టి "విశ్వాసమునకు కర్తయు దాని కొనసాగించువాడైన" ఆయన మీద నిలుపబడినదైయుందా (హెబ్రీ. 12:2)? వ్యక్తిగతమైన ప్రశ్నను మనలను మనమే అడుగుకొందాం: "నేను విశ్వాసమువలన జీవిస్తున్నానా, విశ్వాసంవలన పోరాడుతున్నానా, విశ్వాసంవలన పరుగెత్తుతున్నానా?"

దేవుని వాక్యపు సత్యానికి మనలో కొందరం మన కన్నులు విప్పవలసిన వారమైయున్నాం! ప్రభువైన యేసుతోను ఆయన సంఘంతోను మనలో కొందరం ఆట లాడుట మానాలి! మనం మారుమనస్సు పొందాలి లేకపోతే నశించగలం! "మనం మరలాలి (మారాలి), లేకుంటే కాల్చివేయబడతాం!" దేవుని వాక్యం అలా సెలవిస్తుంది, దానితో తీర్మానం కూడా చేయబడుతుంది! "దాన్ని మనం నమ్ముతున్నామా?" అని మనలను మనమే ప్రశ్నించుకోవాలి.

"మీరు కొంతసేపు కనబడి అంతలో మాయమైపోవు ఆవిరివంటివారే"యని (యాకోబు 4:14) చెప్పిన దేవుని వాక్యం మర్మమైనదేమీ కాదు. ముగింపు గీత కనుమేరలో ఉంది. నిత్యత్వంలో దేవుని సంధించడానికి నీవు ఆయత్తమేనా?